క్లుప్తంగా

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పటాన్‌చెరు టౌన్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకులు, అమీన్‌పూర్ కౌన్సిలర్ ఏడ్ల రమేశ్ అన్నారు. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ గుట్టపై భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో చేపట్టిన రుద్రసహిత శతచండి యాగం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏడ్ల రమేశ్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలనే ఆకాంక్షతో శ్రీరుద్ర సహిత శతచండి యాగం నిర్వహించినట్లు తెలిపారు.ముగింపు సందర్భంగా చండీ సప్తశతి పారాయణం, చండీ హోమంతో పాటు విద్యా శంకర భారతిస్వామి చేతుల మీదుగా మహాపూర్ణాహుతి నిర్వహించినట్లు తెలిపారు.

బస్సు పునరుద్ధరణకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ నుంచి గుంటూరు– చీరాల– కందుకూరు బస్సును పునరుద్ధరించాలని కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్, ఖేడ్ నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు నెహ్రూనాయక్, ఎస్సీసెల్ అధ్యక్షుడు సాయిలు ఖేడ్ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రయాణికులకు ఉపయుక్తంగా ఉండి ఆదాయం గణనీయంగా వస్తున్నా బస్సును రద్దు చేయడం సరికాదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బస్సును పునరుద్ధరించాలని కోరారు.

కొనసాగుతున్న సమ్మె


నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు

ఝరాసంగం(జహీరాబాద్): సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. నిరసనలో భాగంగా ఆదివారం ఝరాసంగం ఐకేపీ కార్యాలయం ఆవరణలో ఐకేపీ వీఓఏలు ఆకులు నమిలి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీఓఏలు, నాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


దెబ్బతిన్న జొన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్‌ఆర్‌టీపీ నియోజకవర్గం కోఆర్డినేటర్ జోనా నరేష్ డిమాండ్ చేశారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆయన ఆదివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల రుపాయల పెట్టుబడులతో పంటలు సాగుచేయగా అకాల వర్షాలకు దెబ్బతిన్నాయని, దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ. 20వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోజెస్, సూర్యకాంత్, అజేయ్ పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ పంపిణీ


వాలీబాల్ కిట్ అందజేస్తున్న శివశంకర్‌రావు

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని గోవిందరాజుపల్లి గ్రామంలో యువకుల అభ్యర్థన మేరకు సునీతమ్మ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షులు బివి శివశంకర్ రావు ఆదివారం వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తి పెంచుని ఉన్నతంగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సునీతరాజు, నాయకులు శ్రీశైలం, కృష్ణ, సాయి, యువకులు పాల్గొన్నారు.

కళలకు వేదిక పటాన్‌చెరు

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


పటాన్ చెరు: ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు

పటాన్‌చెరు: జాతీయ సాహిత్య సంబరాల ప్రారంభం.. పటాన్‌చెరు విద్యా, వైద్యం, క్రీడారంగాలతో పాటు సాంస్కృతిక కళలకు పటాన్‌చెరును వేదికగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరులో తెలుగు వెలుగు సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ సాహిత్య సంబరాలు, సాహిత్యయాత్రను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి జీహెచ్‌ఎంసీ ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయస్థాయి కవుల సమ్మేళనానికి పటాన్‌చెరు వేదికగా నిలవడం అభినందనీయమన్నారు. నేటి తరం విద్యా విధానంలో కళల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో కవులు కళాకారుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు నగేష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, రాజు, తెలుగు వెలుగు సాహిత్య వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి నారాయణరావు, కవులు కళాకారులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి ప్రతీకగా సచివాలయం

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నూతన సచివాలయం నిలుస్తుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించిన సచివాలయం ప్రారంభోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా రాష్ట్ర సచివాలయానికి భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరుగా నామకరణం చేయడం హర్షనీయమని తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు


జిన్నారం: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని అండూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో ఆదివారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ ఖదీర్ పాల్గొన్నారు.

'మన్ కీ బాత్'ను వీక్షించిన బీజేపీ శ్రేణులు


నారాయణఖేడ్‌లో..


జహీరాబాద్‌లో..

పటాన్‌చెరు టౌన్: ప్రధాని నరేంద్రమోడీ 'మన్ కీ బాత్' 100వ ఎపిసోడ్‌ను డివిజన్ పరిధిలోని 189వ పోలింగ్ బూత్ వద్ద బీజేపీ కార్యకర్తలతో కలిసి 'మన్ కి బాత్' ఎపిసోడ్‌ను మాజీ ఎమ్మెల్యే బీజేపీ నేత నందీశ్వర్‌గౌడ్, పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో శక్తికేంద్రం ఇన్‌చార్జి నాగసాని నరేష్ ముదిరాజ్ బూత్ అధ్యక్షులు భరత్ పాల్గొన్నారు.

నారాయణఖేడ్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ మన్ కీబాత్ 100 ఎపిసోడ్లతో ప్రపంచంలోనే చరిత్ర సృష్టించారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప తెలిపారు. నారాయణఖేడ్‌లోని అక్షిత డిగ్రీ కళాశాలలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మన్‌కీబాత్ ఎపిసోడ్‌ను వీక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ కన్వీనర్ రజినీకాంత్, సీనియర్ నాయకులు సాయిరాం, సుధాకర్, పట్నం మాణిక్, బోయిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర మహిళా మోర్చ మాజీ ప్రధాన కార్యదర్శి గోదావరి అంజిరెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం పట్టణంలోని పలు బూతు కేంద్రాల్లో ప్రధాని నరేంద్రమోడీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బలరాం, భూపాల్‌రెడ్డి, రాజు, పెంటా రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

జహీరాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ మన్‌కీ బాత్ ఎపిసోడ్‌ను మహిళా రైతులు మండలంలోని దిడిగి గ్రామ శివారులోని కేవీకేలో ప్రొజెక్టర్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో సస్యరక్షణ శాస్త్రవేత్త స్నేహలత, ఉద్యాన శాస్త్రవేత్త శైలజ, నిపుణులు స్వామి తదితరులు పాల్గొన్నారు.


రామచంద్రాపురంలో..


పటాన్‌చెరు టౌన్‌లో..

ప్రజాపోరు జీపుజాత ప్రారంభం


జీపుజాతను ప్రారంభిస్తున్న జలాలోద్దీన్

జహీరాబాద్ టౌన్: సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు జీపు జాత ఆదివారం ప్రారంభమైంది. సీపీఐ జిల్లా కార్యదర్శి జాలాలోద్దీన్ జెండా ఊపి జీపుజాతను ప్రారంభించారు. పట్టణంలోని భరత్‌నగర్‌లో ప్రారంభమైన జీపుజాత మండలంలోని చిన్నహైదరాబాద్, హోతి(బి), మొగుడంపల్లి, ఆనేగుంట, శేఖాపూర్ మీదుగా కోహీర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జలాలోద్దీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించేందుకు ప్రజాపోరు జీపుజాతను ప్రారంభించినట్లు, ఈ నెల 3వ తేది వరకు జీపు జాత కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి నర్సింలు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ట్రస్ట్ ప్రారంభం

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండలం ఏస్గి గ్రామంలో వెనుకబడిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎడ్యుకేషన్ ట్రస్టును అంబేడ్కర్, పూలే సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు రహీం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ధర్మ సముదాయ మండలి అక్షర ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈ ట్రస్టు కొనసాగుతుందని తెలిపారు. విద్యాపరంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ, అభ్యాసం నేర్పిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు చంద్రకాంత్, నాయకులు సంతోష్, సిద్దప్ప, రాజుకుమార్, మల్లప్ప, జట్టిరాజు, శర్ణప్ప, అర్జున్, సంజీవ్, బాబు, యాదు, మారుతి, లక్ష్మణ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి యోగా శిక్షణ శిబిరం

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిదిలోని గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేటి నుంచి మే 31 వరకు వేసవి యోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు యోగా శిక్షకుడు విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ తరగతులు ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రుద్రస్వాహాకార హోమం


పూజలు చేస్తున్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామ శివారులోని రేవణ సిద్దేశ్వర ఆలయం–చండికాంభ మాత సమేత జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రేణుకాచార్యుల మూల విరాట్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మఠం శివలీలమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాచయ్యస్వామి, ఎంపీటీసీ శంకర్‌పాటిల్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలోని బండ్లగూడకు చెందిన కుర్ర కమల, శ్రీరఘుల కూతురి వివాహానికి పటాన్‌చెరు కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయమ్మ, మాజీ ఎంపీటీసీ నాగమణి, గోపాల్, కమల్, సంతోష్ పాల్గొన్నారు.

గ్రామాలకు హరిత తోరణం



కంది(సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. హరితహారంలో గ్రామాల్లో నాటిన మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. దీంతో గ్రామాలన్నీ హరిత వనాలుగా మారుతున్నాయి. కంది మండలంలోని చెర్లగూడెంలో నాలుగేళ్ల క్రితం రోడ్డకిరువైపులా నాటిన గుల్ మొహర్ మొక్కలు ఏపుగా పెరిగి నీడ ఇవ్వడంతోపాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఏపుగా పెరిగిన చెట్లకు పూసిన ఎర్రటి పూలతో ఆగ్రామం మీదుగా రాకపోకలు సాగించేవారికి స్వాగతం పలుకుతున్నాయి.

సంక్షిప్త వార్తలు

◆ **రాంనగర్‌లో నగర సంకీర్తన**



జహీరాబాద్ టౌన్: పట్టణంలో రాంనగర్‌లో ఆదివారం నగర సంకీర్తనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నగర సంకీర్తనకు భక్తుల నుంచి మంచి స్పందన వస్తుందని తెలిపారు.

◆ **వైద్యఖర్చులకు ఆర్థికసాయం**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అల్విన్‌కాలనీకి చెందిన శ్రీనాత్ కొంతకాలంగా బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. విషయం తెలుసుకున్న పటాన్‌చెరు ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు రమేష్ పటేల్‌తో పాటు సాయిరాజ్, మనోజ్, సందీప్‌లు కలసి తమ వంతు సాయంగా రూ.10వేల అందజేశారు.

◆ **ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష**

కొండాపూర్(సంగారెడ్డి): మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీలలో చేరేందుకు నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓ ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

◆ **కార్మికుల సమస్యలను పరిష్కరించాలి**



జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రాజయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఖాజీపల్లి పారిశ్రామిక వాడలో ఆదివారం మేడే కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో కార్మికులు మేడే ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. నాయకులు శ్రీధర్‌రావు, భాస్కర్‌రెడ్డి, రాజు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

◆ **గొల్లకురుమ సంఘం అధ్యక్షుడిగా పాండు ఎన్నిక**



జహీరాబాద్: పట్టణంలోని గడి మహెలాలో ఆదివారం గొల్లకురుమ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా గడివీధికి చెందిన పాండుయాదవ్ ఎన్నిక కాగా, ఉపాధ్యక్షుడిగా పవన్, అమృత్, ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్, కోశాధికారిగా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా విక్రం, మోహన్, కార్యవర్గ సభ్యుడిగా సంజీవ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, నర్సింహులు, నర్సింహులు, విక్రం, పవన్, ప్రదీప్, సంజీవ్, మోహన్, సుమన్, రమేష్, మల్లేష్, పాండు పాల్గొన్నారు.

అవినీతిపరుల చిట్టా విప్పాలి


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

జహీరాబాద్: దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన వారి చిట్టాను ప్రభుత్వం విప్పాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు జహీరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆదివారం ఎంఎస్‌పీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ జిల్లా కో–కన్వీనర్ అబ్రహాం మాదిగ, ఎంఆర్‌పీఎస్ కో–కన్వీనర్ చిరంజీవి మాట్లాడుతూ దళితబంధు పథకంలో ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడ్డారంటూ స్వయంగా ముఖ్యమంత్రినే వ్యాఖ్యానించారని, ఇందుకు సంబంధించిన వివరాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఉల్లాస్, రాజు, బబ్లూ, సుకుమార్, సురేష్, మహేందర్, ప్రభాకర్, చిన్న, కిషోర్, రజిని, శ్రీను, జైసింగ్, నరేష్, జలీల్, శ్రీనివాస్, ముజమ్మిల్ పాల్గొన్నారు.

ఉజ్జీవ సభల జాతర కరపత్రం విడుదల


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సభ్యులు

జహీరాబాద్ టౌన్: ఈ నెల 12 నుంచి మూడు రోజుల పాటు పట్టణంలోని అల్లీపూర్‌లో నిర్వహించే 91 మెథోడిస్టు క్రైస్తవ ఉజ్జీవ సభల జాతర కరపత్రాన్ని ఆదివారం కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అల్లీపూర్‌లోని గార్డెన్‌నగర్‌లో ఉజ్జీవ సభల జాతర ప్రారంభమవుతుందని తెలిపారు. 12న వివిధ గ్రామాల నుంచి జెండాలతో ఊరేగింపు, 13న దైవధ్యానం, బాప్తిస్మంలతో పాటు ఉచిత వైద్యశిబిరం, ఆటల పోటీలు, సంగీత పోటీలు, నాటక ప్రదర్శన, చలనచిత్ర పదర్శన. మొగుడంపల్లి జైరాజ్‌చే బుర్రకథ ప్రదర్శన ఉంటుందని చెప్పారు. 14న దైవ ఆరాధన, బిషప్ డ్యానియల్‌చే దైవసందేశం, రోగులకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారి రెవ జాన్ వెస్లీ, జిల్లా సెక్రటరీ డాక్టర్ రవికుమార్, జిల్లా లీడర్ డాక్టర్ నరీన్‌జాన్, మెథడిస్టు పాస్టర్లు పాల్గొన్నారు.

మంత్రులకు శుభాకాంక్షల వెల్లువ


జహీరాబాద్: మంత్రి హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు


జహీరాబాద్: మంత్రికి స్వీట్ తినిపిస్తున్న ఎంపీ

జహీరాబాద్: కొత్త సచివాలయ భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా పలువురు మంత్రులను ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం కొత్త సచివాలయంలో వారు ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు, హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి పూలగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులను కలిసినవారిలో డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్, బీఆర్‌ఎస్ నేత మొహియొద్దీన్ ఉన్నారు.


జోగిపేట: మంత్రి హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): నూతన సచివాలయంలో మంత్రి హరీశ్‌రావును అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలోఎంపీ బీబీ పాటిల్, రాష్ట్ర తెలంగాణ జాగృతి కార్యదర్శి బిక్షపతి ఉన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న తహసీల్దార్

మనూరు(నారాయణఖేడ్): బోరంచ నల్లపోచమ్మ ఆలయానికి కద్పల్ గ్రామానికి చెందిన భక్తుడు వెంకట్ భక్తుల సౌకర్యార్థం రూ.2లక్షల విలువైన మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయించిన ప్లాంటును తహశీల్దార్ తారాసింగ్ ప్రారంభించారు. అనంతరం దాత కద్పట్ వెంకట్‌ను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రవి, సత్యనారాయణ, రాంశెట్టిపాటిల్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


కాలనీలోకి చేరిన వర్షపు నీరు

ఖేడ్‌లో భారీ వర్షం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో పలు కాలనీలలోకి నీరువచ్చి చేరింది. గత మూడు రోజులుగా వర్షం కురుస్తుండడంతో చేతికందిన పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: సీసీ రోడ్డు నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ నేతజీనగర్ కాలనీలో పర్యటించారు. అనంతరం అంబేడ్కర్ కాలనీలో చేపట్టిన నూతన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

8 నుంచి ఎల్లమ్మ జాతర


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మునిపల్లి(అందోల్): రేణుక ఎల్లమ్మ జాతరకు సంబంధించి కరపత్రాలను కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం సొసైటీ అధ్యక్షులు రమేశ్‌గౌడ్ ఆదివారం అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 8, 9, 10వ తేదీల్లో జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. 8వ తేదీ యజ్ఞం, 9వ తేదీ అమ్మవారికి బోనాలు, 10న అమ్మవారి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు చంద్రయ్యగౌడ్, డైరెక్టర్ నర్సింలు, ఏల్లగౌడ్, చంద్రగౌడ్, సంఘం సభ్యులు నరేందర్‌గౌడ్, మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.